క్లుప్తంగా

వల్లూరమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వల్లూరమ్మ తల్లి

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో రాహుగ్రస్త చంద్రగ్రహణం అనంతరం అమ్మవారికి ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఈఓ బి.రమేష్ తెలిపారు. అర్చకులు ఉదయం 6 గంటలకు శాస్త్రోక్తంగా ఆలయాన్ని పరిశుభ్రం చేసి, పంచామృత అభిషేకాలు, పూజలు నిర్వహించి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ట్రస్టు బోర్డు చైర్మన్ కాలే శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ తల్లి

జరుగుమల్లి: మండలంలోని కామేపల్లి పోలేరమ్మ దేవస్థానంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అభిషేకాల అనంతరం పోలేరమ్మను ఆలయ అర్చకులు శ్రీనివాస శర్మ ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఈఓ రావెళ్ల శివశంకర్, దేవస్థానం చైర్మన్ సూరంపల్లి కొండయ్య, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు.

సింహగర్జనకు తరలిన నూర్‌బాషాలు

కనిగిరి రూరల్: నూర్‌బాషా, దూదేకుల సింహగర్జన ఛలో గుంటూరు కార్యక్రమానికి కనిగిరి నుంచి నూర్‌బాషా దూదేకుల ముస్లింలు ఆదివారం తరలి వెళ్లారు. నూర్‌బాషా, దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగే సింహగర్జనకు ప్రత్యేక వాహనాల్లో ర్యాలీగా బయలు దేరారు. ఎస్‌కే బారాయిమామ్, మౌలాలి, ఆర్‌ఎంఎస్ మస్తాన్, బాలమాదార్, సిద్దయ్య, చిన్న పాచ్చు, పెద్ద పాచ్చు, హుస్సేన్, ఇమామ్, ఖాశిం, తదితరులు పాల్గొన్నారు.

అమృత్ కలశాల తరలింపు


కలశాలతో ర్యాలీగా వెళ్తున్న బీజేపీ నాయకులు

పామూరు: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మేరామట్టి మేరాదేశ్, అమృత్ కలశ్ కార్యక్రమంలో భాగంగా ఇటీవల సేకరించిన మట్టితో నిండిన కలశాలను ఆదివారం విజయవాడకు తరలించినట్లు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేవీ రమణయ్య తెలిపారు. ఈసందర్భంగా అమృత్ కళశాలను ర్యాలీగా తరలించారు. జాజం చినసుబ్బయ్య, యం.వెంకటరమణ, కొప్పరపు వెంకట సుబ్బారావు, కొత్తూరి గోపాల్, పాడే అరవింద, నాయకులు పాల్గొన్నారు.

చట్టసభల్లో నూర్‌బాషాలకు ప్రాధాన్యత ఇవ్వాలి

మార్కాపురం: రానున్న ఎన్నికల్లో నూర్‌బాషాలకు చట్టసభల్లో స్థానం కల్పించాలని కోరుతూ ఆదివారం గుంటూరులో నిర్వహించిన నూర్‌బాషాల సింహగర్జన సభకు మార్కాపురం వైఎస్సార్ సీపీ నాయకులు, రాష్ట్ర నూర్ బాషా యూత్ అధ్యక్షుడు, కేతగుడిపి సర్పంచ్ డి.పెద్ద మస్తాన్ ఆధ్వర్యంలో 150 వాహనాల్లో గుంటూరుకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ.. నూర్ బాషా కులస్తులు మైనార్టీల్లో అంతర్భాగమైనప్పటికీ రాజకీయంగా సరైన ప్రాతినిధ్యం లేదన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ మీరావలి, మీర్జపేట సర్పంచ్ మీరయ్య, 18,23 వార్డు కౌన్సిలర్లు కరీముల్లా, డి.ప్రసాద్, సిద్దవరం ఎంపీటీసీ మీరావలి, మునగపాడు సర్పంచ్ నబీ సాహెబ్, సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదాం సాహెబ్ పాల్గొన్నారు.

దువా పేరుతో మోసం

పొదిలి రూరల్: దువా పేరుతో ఓ మహిళను ఇద్దరు వ్యక్తులు మోసగించి రూ.11 వేల నగదుతో ఉడాయించారు. పొదిలి పట్టణంలోని పడమటిపాలెం వీధిలో నివాసం ఉంటున్న షేక్ బషీరా ఇంటికి ఆదివారం ఇద్దరు వ్యక్తులు ఫకీర్ వేషంలో వెళ్లారు. దుష్ట శక్తులు పోయేందుకు దువా చేస్తామని మాయమాటలు చెప్పారు. దువా సమయంలో రూ.11 వేలు పెట్టాలని, ప్రార్థన కాగానే ఇచ్చేస్తామని నమ్మబలికి ఉడాయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట సైదులు తెలిపారు.

ప్రజారక్షణ భేరి సభకు తరలిరండి

దొనకొండ: రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధన కోసం సీపీఎం ప్రణాళిక రూపొందించిందని, దానిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార ఉద్యమాన్ని నిర్వహిస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు తెలిపారు. ఆదివారం దొనకొండలో సీపీఎం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ నవంబర్ 15న గ్రామాల నుంచి విజయవాడకు ప్రజారక్షణ భేరి సభకు తరలిరావాలని కోరారు.

అంబేడ్కర్ ఆశయాలు జగనన్నతోనే సాధ్యం

- వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు
- టంగుటూరులో ఎస్సీల ఆత్మీయ సదస్సు
- నియోజకవర్గ నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన ఎస్సీలు



మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు


టంగుటూరులో ఆత్మీయ సదస్సుకు హాజరైన ఎస్సీలు

టంగుటూరు: అంబేడ్కర్ ఆశయాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఎస్సీ ఆత్మీయ సదస్సుకు ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, సతీమణి లక్ష్మి, కుమారుడు గౌతమ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరికూటి మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో రిజర్వేషన్ కల్పిస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయన ఆశయాలు నెరవేరుస్తూ ఎస్సీలను రెండు కళ్లుగా చూసుకుంటున్నారన్నారు. ఎన్నికల ముందు చెప్పినట్లుగానే ఎస్సీలకు అన్ని రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలు మెరుగ్గా అందించారన్నారు. ఎస్సీలకు సరైన న్యాయం జరుగుతోందంటే అది వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాత్రమేనన్నారు. టీడీపీ జమానాలో అయితే ఎస్సీ కార్పొరేషన్ రుణాల పేరుతో జన్మభూమి కమిటీలు, టీడీపీ నాయకులు జేబులు నింపుకున్నారని విమర్శించారు.

అసలు ఎమ్మెల్యే స్వామా.. దామచర్ల సత్యా?

నియోజకవర్గ దళితులు, ఇతర వర్గాల ప్రజలు సమస్యలపై ఇచ్చే అర్జీలు దామచర్ల సత్య తీసుకోవడమేంటో అర్థం కావడం లేదన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే స్వామా లేక దామచర్ల సత్యనా అని ధ్వజమెత్తారు. నియోజకవర్గంలోని ఎస్సీలకు మరుగుదొడ్ల కోసం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు అప్పనంగా కాజేశారని నిప్పులుచెరిగారు. దామచర్ల కుటుంబానికి ఎమ్మెల్యే స్వామి బానిసలా మారాడని దుయ్యబట్టారు. తూర్పునాయుడుపాలెంలో నియోజకవర్గ స్థాయి సమావేశం జనసేనతో కలిపి నిర్వహిస్తే 225 మంది కూడా రాలేదన్నారు. తాను సమావేశం నిర్వహిస్తే ఎంత మంది వచ్చారో ఒక్కసారి కళ్లు తెరిచి చూడాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మంచి నీటి లైనుకు 90 ఎంఎం పైపులు వాడి, తన ఇంటికి సాగర్ కాలువ నుంచి వచ్చే పెద్ద పైపులైన్ వేసుకోవడాన్ని ప్రశ్నిస్తే ఎమ్మెల్యే స్వామి టోల్ ప్లాజా వద్ద తన చొక్కాను తానే చింపుకొని డ్రామాలు ఆడిన విషయాన్ని గుర్తు చేశారు. స్వామి తన వివాహం గురించి అవాకులుచెవాకులు పేలాడని, అసలు నువ్వు ఎవరిని చేసుకోబోయి ఎవరిని చేసుకున్నావో నియోజకవర్గంలోని ప్రజలందరికీ తెలుసని దుయ్యబట్టారు.

నారా చంద్రబాబు స్కిల్ డెవలెప్‌మెంట్ స్కామ్‌లో రూ.371 కోట్లు దోచేశారని, ఇన్నర్ రింగ్ రోడ్డు దారి మళ్లింపు, అమరావతి ఎస్సీ రైతుల నుంచి అసైన్డ్ భూములు బలవంతంగా లాక్కొని సాక్ష్యాధారాలతో అడ్డంగా దొరికి జైలుకు వెళ్లారన్నారు. చంద్రబాబు ఒక్క ఎస్సీకి అయినా సెంటు భూమి ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ఆయన దోచుకోవటం దాచుకోవడం తప్ప పేద ప్రజలకు ఏమీ చేయలేదని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, రాష్ట్ర కార్యదర్శి డాకా పిచ్చిరెడ్డి, కొండపి ఏఎంసీ డైరెక్టర్ కొమ్ము సురేంద్ర, ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు, మల్లవరపు రాఘవరెడ్డి, సామంతుల రవికుమార్‌రెడ్డి, బత్తిన మనోహర్, పల్లపోతు బాలకోటిరెడ్డి, దళిత ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరవీరుల సేవలు చిరస్మరణీయం

- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుర్రా

పామూరు: వృత్తినే దైవంగా భావించి, విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఆదివారం స్థానిక అనిల్‌గార్డెన్స్‌లో పామూరు సర్కిల్ పరిధిలో సీఐ కాటూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే బుర్రా మాట్లాడుతూ వృత్తిరీత్యా పోలీస్ సిబ్బంది కొన్ని సమయాల్లో కఠినంగా వ్యవహరించినా అది విధుల్లో భాగమేనన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా పోలీస్‌సిబ్బంది ప్రజలతో మమేకమై ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందిస్తున్నారన్నారు. శిబిరంలో యువత రక్తదానం చేయడం అభినందనీయమని రక్తదానంచేసి వారు ప్రాణదాతలుగా నిలిచారన్నారు. సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి పౌరుడు యూనిఫాం లేని పోలీస్ అని, ఎక్కడైనా అన్యాయం జరుగుతుంటే పోలీసుల దృష్టికి తేవాలన్నారు. పోలీస్ సిబ్బందిని సమాజసేవకులుగా, ప్రజారక్షకులుగా చూస్తూ వారి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రక్తదాన శిబిరంలో 117 మంది రక్తదానం చేశారు. ఎస్సైలు పామూరు కె.సురేష్‌యాదవ్, సీఎస్‌పురం పి.అనిల్‌కుమార్, వెలిగండ్ల పి.మహేష్‌కుమార్, ఎంపీపీ గంగసాని లక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుస్సేన్‌రెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు యాదాల సాయికిరణ్, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు చాంద్‌బాషా, జేసీఎస్ కన్వీనర్ ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

బడుగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్


శంకుస్థాపనలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, పక్కన చైర్మన్, వైస్ చైర్మన్

కనిగిరి రూరల్: బడుగుల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక 18వ వార్డులోని మాచర్ల వెంగయ్య రజక భవన్‌కు ఆదివారం ఎమ్మెల్యే బుర్రా చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు చేపట్టినట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బడుగు వర్గాలకు అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తున్నటు వివరించారు. కార్యాక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ బీసీలంతా వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పులిశాంతి గోవర్ధన్‌రెడ్డి, జేసీఎస్ పట్టణ కన్వీనర్ వేల్పుల వెంకటేశ్వర్లు యాదవ్, కౌన్సిలర్లు రామనబోయిన శ్రీను, దాసరి మురళి, సొసైటీ అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వర్లు, రజక సంక్షేమ సంఘం నాయకులు దేపూరి వెంకటేశ్వర్లు, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, నారాయణ, రాష్ట్ర డైరక్టర్ చెరుకూరి చిన కాశయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు జి.. రవికుమార్, నల్లబాల రత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిక


కండువా కప్పి ఆహ్వానిస్తున్న వరికూటి అశోక్‌బాబు

- పది కుటుంబాలను ఆహ్వానించిన వరికూటి

టంగుటూరు: స్థానిక అంబేడ్కర్ నగర్ చెందిన టీడీపీ మద్దతుదారులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కుల, మత, పార్టీలకు అతీతంగా అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై ఆదివారం వైఎస్సార్ సీపీలోకి చేరారు. మద్దిరాల కిరణ్‌కుమార్ మరో 10 కుటుంబాలకు చెందిన 35 మందిని టంగుటూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆ పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, కొండపి ఏఎంసీ డైరెక్టర్లు కొమ్ము సురేంద్ర, దుగ్గిరాల పేర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వ్యక్తులను శిక్షించాలి

కనిగిరి రూరల్: విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వ్యక్తులను తక్షణం అరెస్ట్ చేసి, శిక్షించాలని ఆర్టీసీ ప్రజా రవాణ ఉద్యోగుల జేఏసీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్టీసీ డిపో ప్రాంగణంలో నిరసన తెలిపారు. ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగిపై విచక్షణా రహితంగా వ్యవహరించి, భౌతిక దాడులకు పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకొని శిక్షించాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎల్‌సీహెచ్ వెంకటేశ్వర్లు, జీ సుందరరావు, సయ్యద్ పీరావలి, రమేష్ బాబు, ఎస్‌కే సమీర్, సుబ్బారావు, డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.

నీళ్లు.. పెట్రోల్ వాసనొస్తున్నాయ్

కొనకనమిట్ల: కొనకనమిట్ల బస్టాండ్ సమీపంలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న హిందుస్థాన్ పెట్రోల్ బంక్ సమీపంలో ఇళ్లలోని బోర్ల నీరు గత కొన్ని రోజులుగా పెట్రోల్ వాసన వస్తుండటంపై ఆ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ బంక్‌లోని ట్యాంక్ ఏమైనా లీకై ఉంటుందేమో పరిశీలించాలని బంక్ యజమానులకు తెలిపినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఆదివారం నిరసన తెలిపారు. వాహనాలకు పెట్రోల్ కొట్టకుండా స్థానికులు నుసుం శ్రీను, రమణయ్య, బుడ్డారెడ్డి, రామకృష్ణ, వేంపాటి వెంకటరెడ్డి తదితరులు అడ్డుకున్నారు. వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని బంక్ యజమాని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

వైభవంగా మహానివేదన, గోపూజ


గోపూజలో పాల్గొన్న ఆలయ కమిటీ ఛైర్మన్, ఈవో, భక్తులు


మహానివేదనతో ఆలయ కమిటీ ఛైర్మన్, ఈవో, భక్తులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం గోపూజ, మహానివేదన కార్యక్రమాలు అర్చకులు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గోమందిరంలో గోవుకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం భజంత్రీల మేళతాళాలనడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు. ఆలయ చైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ, ఈఓ జి.రమణారెడ్డి, కమిటీ సభ్యులు మంచికంటి మధుసూదనరావు, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు పాల్గొన్నారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి


మాట్లాడుతున్న సీపీఎం పశ్చిమ ప్రకాశంజిల్లా కార్యదర్శి హనీఫ్

పామూరు: వర్షాభావ పరిస్థితులు నెలకొని పంటలు ఎండిపోయి రైతులు నష్టాలపాలవుతున్నారని తక్షణం ప్రకాశంజిల్లాను కరువుజిల్లాగా ప్రకటించి ప్రత్యేక చర్యలతో ఆదుకోవాలని సీపీఎం పశ్చిమ ప్రకాశంజిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం సీపీఎం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాలులేక పంటలసాగు తగ్గిపోగా అక్కడక్కడా సాగుచేసిన వరి, మిర్చి, కంది, మినుము, పొగాకు రైతులు వర్షంకోసం ఎదురుచూస్తూ దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. వ్యవసాయాధికారులు తక్షణం రైతులు సాగుచేసిన పంటలకు ఈక్రాప్‌చేసి పరిహారం వచ్చేలా చేసి రైతులను ఆదుకోవాలన్నారు. కొమ్మలపాటి మాల్యాద్రి, షేక్.అల్లాబక్షు, షేక్.మీరావళి, షేక్.నాయబ, పలువురు సీపీయం నాయకులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో ప్రజాసేవ



పోలీస్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న డీఎస్పీ రామచంద్ర



రక్తదానం చేసిన ఎస్సైని అభినందిస్తున్న డీఎస్పీ రామచంద్ర

కందుకూరు: ప్రజా సేవలో ప్రాణాలు వదిలిన అమరవీరుల స్ఫూర్తితో పోలీస్ సిబ్బంది ముందడుగు వేయాలని డీఎస్పీ రామచంద్ర అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక వెంగమాంబ పంక్షన్‌హాలులో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. డీఎస్పీ అమరవీరులకు నివాళులర్పించారు. ఎంతో మంది పోలీస్ ఉన్నతాధికారులు ప్రజా సేవలో ప్రాణాలు వదిలారని, వారిని గుర్తు చేసుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యమన్నారు. సమాజంలోని అరాచక శక్తులను అణచివేయడంలో పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటారని, ఈ క్రమంలో ప్రాణాలను సైతం లెక్కచేయరని కొనియాడారు. నిస్వార్థంతో చేసే ప్రజా చిరకాలంలో చెరగని ముద్ర వేస్తుందని, సమాజ, శాంతి భద్రతలను కాపాడేందుకు సిబ్బంది ముందుండాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులతో పాటు, సిబ్బంది మొత్తం 73 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారిని ప్రత్యేకంగా అభినందించారు. కందుకూరు, గుడ్లూరు సీఐలు నఫీజ్‌బాష, సుబ్బారావు, పలువురు ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబ దేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమపూజలు, అఖండహారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

అంకమ్మతల్లికి ఘనంగా పొంగళ్లు

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని వితలాపురం గ్రామంలో అంకమ్మతల్లికి ఆదివారం ఘనంగా పొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన మారం వారి కుటుంబ సభ్యులు అంకమ్మతల్లికి పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ పరిశీలకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మారం ఇంద్రసేనారెడ్డి, చీమకుర్తి మాజీ సర్పంచ్ మారం వెంకటేశ్వర రెడ్డి, మాజీ కౌన్సిలర్ కోటా రాములు, నాయకులు మారం పురుషోత్తమరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వర్షాల కోసం ప్రత్యేక పూజలు

గిద్దలూరు రూరల్: మండలంలోని కొంగలవీడు గ్రామ ప్రజలు వర్షాల కోసం గ్రామ సమీపంలో గల అంకాల పరమేశ్వరి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం నుంచి కుంకుమ బండ్లను కట్టుకుని ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొత్తపల్లెలో పోలేరమ్మ జాతర

బేస్తవారిపేట: మండలంలోని ఆర్ కొత్తపల్లెలో ఆదివారం పోలేరమ్మ జాతర నిర్వహించారు. గ్రామంలో ఇంటి నుంచి బోనాలు ఎత్తుకుని, కుంకుమ బండ్లతో ఊరేగింపుగా పోలేరమ్మ ఆలయం వద్దకు తరలివెళ్లారు. అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారోత్సవాన్ని జయప్రదం చేయండి

కనిగిరి రూరల్: బీసీ సంక్షేమ సంఘ జిల్లా జిల్లా కార్యవర్గ సమావేశానికి బీసీలంతా అధిక సంఖ్యలో తరలిరావాలని సంఘ జిల్లా నూతన అధ్యక్షుడు బలగాని ఆంజనేయులు అన్నారు. నవంబర్ 5న ఒంగోలులో బీసీ సంక్షేమ సంఘ, ఒంగోలు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరగనున్న నేపథ్యంలో ఆదివారం కనిగిరిలో బీసీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం బీసీ నాయకులకు ఆహ్వాన పత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గోనుగుంట బ్రహ్మానంద శర్మ సిద్ధాంతి, బండారు సోమరాజు, నియోజకవర్గ నాయకులు ఈర్ల విజయరామ రాజు, ఎస్‌కే నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి


డిపో గ్యారేజీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

కందుకూరు: కావలి వద్ద ఆర్టీసీ డ్రైవర్ బీఆర్ సింగ్‌పై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఆర్టీసీ కార్మికుల జేఏసీ డిమాండ్ చేశారు. డ్రైవర్‌పై దాడి చేయడాన్ని నిరసిస్తూ కందుకూరు ఆర్టీసీ డిపోని అన్ని యూనియన్లు జేఏసీగా ఏర్పడి ఆదివారం డిపోలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ యూనియన్ డిపో అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు మాట్లాడుతూ దాడిలో పాల్గొన్న దుండగులందరిని అరెస్టు చేసి నాన్ బెయిల్‌బుల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ఎంయూ అధ్యక్షుడు కోటయ్య మాట్లాడుతూ నిరంతరం ప్రజా సేవ చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం భద్రత కల్పించాలన్నారు. వైఎస్సార్ యూనియన్ నాయకుడు శ్రీనివాసరావు, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ దాడి చేసిన వ్యక్తులను అరెస్టు చేయాలని, రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎంప్లాయీస్ యూనియన్ రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ డీవై కొండయ్య అధ్యక్షత వహించిన కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కోటేశ్వరరావు, జేఏసీ నాయకులు సుబ్బారావు, సదానందం, శివకృష్ణ, రహంతుల్లా, శ్రీనివాసరావు, రమణారెడ్డి, కృష్ణారెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

రిటైర్డ్ అధ్యాపకులు ఓబులురెడ్డి మృతి

పీసీపల్లి: మండలంలోని బుడ్డారెడ్డిపల్లికి చెందిన రిటైర్డు అధ్యాపకులు కొండ్రెడ్డి ఓబులురెడ్డి(79) అనారోగ్యంతో శనివారం ఉదయం ఒంగోలులోని ప్రైవేట్ ఆస్పత్రిలో కన్నుమూశారు. కొండ్రెడ్డి ఓబులురెడ్డి మంచి అధ్యాపకులుగా పేరు తెచ్చుకున్నారు.